


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 158 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప గురువారం 12 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :158 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA THU 12 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు





**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా

- మిగతా2లో



## సున్నిత రంగాలపై ఎప్పుడూ స్పష్టమైన వైఖరితో ఉన్నామని వెల్లడి

- అమెరికాతో వాణిజ్య ఒప్పందం... వాణిజ్య శాఖ కార్యదర్శి కీలక వ్యాఖ్యలు
- అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకొని చర్చలు జరిపామన్న వాణిజ్య శాఖ కార్యదర్శి
- రైతులు, మత్స్యకారులు, పాడి పరిశ్రమలను రక్షించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడి

- మిగతా2లో



## ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి..

- జనగణమన కంటే ముందు తప్పనిసరి: 'వందేమాతరం'పై కేంద్రం కీలక నిర్ణయం
- కొత్త నిబంధనలు విడుదల చేసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ
- ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరి
- అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిక

'వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది.

- మిగతా2లో



## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు: ఏపీ గవర్నర్ ప్రసంగం...

- రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం
- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ
- గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు.సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ

- మిగతా2లో

## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు



- గవర్నర్ ప్రసంగం అవాస్తవాలు, కల్పితాలతో నిండిన డొల్ల పత్రం అని షర్మిల విమర్శ
- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపణ
- పోలవరం ఎత్తు తగ్గించి, ఆరోగ్యశ్రీని చంపేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ప్రతిపక్ష నేతగా జగన్ విఫలమయ్యారని, దమ్ముంటే రాజీనామా చేయాలని డిమాండ్

- మిగతా2లో



## ఏం చేద్దాం శ్రీనివాస్?

### అసెంబ్లీ బయట దువ్వాడ శ్రీనివాస్ కు జగన్ పలకరింపు

- ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి దువ్వాడ బహిష్కరణ
- జగన్ తో మాట్లాడే ప్రయత్నం చేసిన దువ్వాడ
- వైసీపీ అవకాశం ఇవ్వకపోతే సొంతంగా పోటీ చేస్తానన్న దువ్వాడ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను బహిష్కరించిన సంగతి తెలిసిందే. అయితే, అసెంబ్లీ ప్రాంగణంలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ నుంచి జగన్ బయటకు వస్తున్న సమయంలో ఆయనను దువ్వాడ శ్రీనివాస్ కలిశారు.

- మిగతా2లో

## వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

### మూడు పార్టీలకు పవన్ కల్యాణ్ సూచన

- చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం
- వైసీపీ కుట్రల పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచన
- హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూస్తోందని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగిస్తుండగా 11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు.

- మిగతా2లో



## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

### కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- ఆర్థిక మంత్రి నవ్వుతూ ఉంటారు.. మన డేటాతో ఏం చేశారని లోక్‌సభలో ప్రశ్న
- ఈ ఒప్పందంతో దేశ టెక్స్‌టైల్ పరిశ్రమ, రైతులు నాశనమవుతారని ఆరోపణ
- దేశ ప్రయోజనాలను అమెరికాకు అమ్మేశారంటూ సంచలన వ్యాఖ్యలు
- ఇంధన స్వాతంత్ర్యాన్ని కూడా అమెరికాకు తాకట్టు పెట్టారని ధ్వజం



**పెన్ పవర్ డెస్క్:**లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, దీని ద్వారా దేశాన్ని, 'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా

- మిగతా2లో

## మహారాష్ట్రలో దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డు..

- ముంబై కోస్టల్ రోడ్డులోని నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే దారిలో సంగీత స్ట్రిప్‌లు
- ప్రారంభించిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్
- వాహనదారులకు అలరించనున్న స్లమ్ డాగ్ మిలియనీర్ చిత్రంలోని 'జయహో' పాట

2లో



## ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం.. 11 నిమిషాల్లోనే వెళ్లిపోయిన జగన్

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభలోకి వచ్చిన వైసీపీ సభ్యులు
- గవర్నర్ ప్రసంగానికి పదేపదే అడ్డుతగిలిన వైనం
- ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ పట్టుబట్టిన వైసీపీ

2లో



## ఎడిటర్ వ్యూ

# మదుపర్లకు భద్రత.. మార్కెట్‌కు ముప్పు!

ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ కొందరిని మెప్పించగా.. మరికొందరిని నిరాశపర్చింది. దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా పడింది. 1999 తర్వాత మళ్లీ ఆదివారం నిర్వహించిన 'ఫుల్ సెషన్' నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ సుమారు 1500 పాయింట్లు, నిఫ్టీ సుమారు 500 పాయింట్లు పడిపోయింది. అయితే ఈ బడ్జెట్లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించి 'ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్' విభాగంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. ఇది మదుపర్లకు భద్రతగా కొందరు విశ్లేషిస్తుండగా.. మరికొందరు భవిష్యత్తులో 'మార్కెట్'కు ముప్పు తప్పదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో కేంద్రం 'డెరివేటివ్స్ మార్కెట్'కు సంబంధించి పన్నులను భారీగా పెంచింది. స్పెక్యులేషన్‌ను తగ్గించే పేరుతో ఎస్‌టీటీ (సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) రేట్లను సవరించింది. ఈక్విటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై పన్నును 150 శాతం పెంచింది. మరీ ముఖ్యంగా రిటైల్ ట్రేడర్లు ఎక్కువగా ఆసక్తి చూపించే ఆప్షన్స్ ట్రేడింగ్‌లో.. ప్రీమియం విలువను 50 శాతం పెంచింది. ఫ్యూచర్స్ ఎక్సర్ సైజ్ చేసేటప్పుడు ఉన్న ఎస్టీటీని 20 శాతం పెంచింది. ఈ పన్ను పెంపులను 'సామాన్యుల రక్షణ కవచం'గా కొందరు అభివర్ణిస్తున్నారు.. గతంలో విడుదలైన నివేదికల ప్రకారం.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న వారిలో 90 శాతం మంది నష్టాల పాలవుతున్నారు. స్టాక్ మార్కెట్‌పై పరిజ్ఞానం లేని యువత, వేతన జీవులు.. త్వరగా సంపన్నులవ్వాలనే ఆశతో ఇందులో దిగి ఉన్నది పోగొట్టుకుంటున్నారు. పన్నులు పెంచడం ద్వారా వీరి ప్రవేశాన్ని కఠినతరం చేసినట్లవుతుంది. మరోవైపు స్టాక్ మార్కెట్ అనేది సంపద సృష్టికి వేదిక.. కానీ క్షణాల్లో లాభ నష్టాలను తేల్చే జూదశాలగా కొందరు మార్చేశారు. అధిక పన్నుల వల్ల స్పెక్యులేషన్ ఆధారంగా జరిగే ట్రేడింగ్ తగ్గి.. పెట్టే పెట్టుబడులు స్థిరమైన ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లే అవకాశముంది. చిన్న మొత్తాలతో పెద్ద రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి.. ప్రజల్లో పొదుపు, సురక్షితమైన పెట్టుబడి అలవాట్లను ప్రోత్సహించడానికి ఈ పన్ను పెంపు దోహదపడుతుందనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పన్ను పెంపు వల్ల మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఆందోళనలు సైతం వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ సజావుగా సాగాలంటే కొనుగోలు, అమ్మకం దారుల రద్దీ (లిక్విడిటీ/వాల్యూమ్) ఉండాలి. పన్ను భారం వల్ల ట్రేడర్లు మార్కెట్ నుంచి తప్పుకుంటే ట్రేడింగ్ పరిణామం భారీగా పడిపోతుంది. దీని వల్ల పెద్ద ఇన్వెస్టర్లు తమ షేర్లను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా ఇబ్బంది అవు తుంది. ఇది మార్కెట్ పతనానికి దారితీయొచ్చుననే ఆందోళన సైతం ఉన్నది. మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు తమ నష్టాల ను తగ్గించుకోవడానికి ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను వాడుకుంటాయి. ఇప్పుడు పన్నుల పెంపుతో ఇది ఖరీదైన వ్యవహారంగా మారుతుంది. పరోక్షంగా ఈ భారం మళ్లీ సామాన్య మదుపర్లపైనే పడుతుంది. చట్టబద్ధమైన పన్నులు భరించలేక ట్రేడర్లు ప్రభుత్వ నియంత్రణ లేని 'డబ్బా ట్రేడింగ్' లేదా విదేశీ యాప్స్ ద్వారా జరిగే ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ వైపు మళ్లే ప్రమాదముంది. అంతేకాకుండా స్టాక్ బ్రోకింగ్ సంస్థలు, ట్రేడింగ్ పై ఆధారపడి జీవిస్తున్న ప్రొఫెషనల్ ట్రేడర్ల ఆదాయంపై ఇది కోలుకోలేని దెబ్బవేస్తుంది. ఫిన్ టెక్ రంగంలో ఉద్యోగాల కోతకు సైతం దారితీయొచ్చు. సామాన్యులను ఆర్థిక నష్టాల నుంచి కాపాడాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే అయినా.. దాని కోసం ఎంచు కున్న మార్గం మార్కెట్ సమతుల్యను దెబ్బతీయొద్దు. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిశితంగా గమనిస్తూ.. అవసరమైతే భవిష్యత్తులో దిద్దుబాటు చర్యలు చేపడితే బాగుంటుంది.

# వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైసీపీ హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు.

అనంతరం, పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి ముగించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.జగన్ పలకరింపు అనంతరం మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ... త్వరలోనే జగన్ ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే, సొంతంగా పోటీ చేసి తన బలం చూపిస్తానని అన్నారు. శాసనమండలిలో తన వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళతానని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుల వైపు మాట్లాడతానని అన్నారు.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

- మొదటి పేజి తరువాయి

క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

**కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# సున్నిత రంగాలపై ఎప్పుడూ స్పష్టమైన వైఖరితో ఉన్నామని వెల్లడి

వాణిజ్య ఒప్పందాలలో, సున్నిత రంగాలపై భారతదేశం ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో చర్చలు జరిపిందని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలోనూ వ్యవసాయం సహా కీలక రంగాల ప్రయోజనాలను కాపాడేలా ముందుకు వెళ్లామని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వైఖరితోనే వాణిజ్య చర్చలు జరిపినట్లు తెలిపారు. అన్ని ఒప్పందాల విషయంలో ఇలా స్పష్టమైన వైఖరితోనే ఉన్నామని అన్నారు. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ సహా ప్రభావితమవుతాయని భావించిన రంగాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని రక్షించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. భారత్, అమెరికా ఉమ్మడి ప్రకటనను చట్టబద్ధమైన ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలు పనిచేస్తున్నాయని, మార్చి నెలాఖరు నాటికి దీనిని ఖరారు చేసి సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఒప్పందాలలో సున్నితమైన రంగాలకు రక్షణ కల్పించామని, అంతగా సున్నితం కానటువంటి రంగాల విషయంలో మాత్రం మన మార్కెట్‌ను తెరిచేందుకు సుంకాలను ఉపయోగించామని తెలిపారు. కీలకమైన మన ఉత్పత్తులు ఉన్న రంగాల్లో మాత్రం మార్కెట్ ఇవ్వలేమని అమెరికాకు స్పష్టం చేశామని అన్నారు.

# ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం.. 11 నిమిషాల్లోనే వెళ్లిపోయిన జగన్

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు. మరోపక్క, శాసనసభకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జగన్ చేరుకున్నారు. 'ప్రతిపక్ష హోదా ఇవ్వాలి' అనే ప్లకార్డులను, బ్యానర్లను పట్టుకుని వీరు అసెంబ్లీకి చేరుకున్నారు. వైసీపీ సభ్యులంతా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వచ్చారు. గేట్ నెంబర్ 4 నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వీరు సభలోకి వెళ్లారు.

గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో ఆయన ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినదించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, 11 నిమిషాల వ్యవధిలోనే గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేసి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. సభ నుంచి బయటకు వచ్చిన వెంటనే జగన్ తన కాన్వాయ్ లో తాడేపల్లిలోని నివాసానికి వెళ్లిపోయారు. దీంతో, సభలో జగన్ ఏదైనా మాట్లాడతారేమోనని ఎదురు చూసినవారంతా నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం సభలో గవర్నర్ ప్రసంగం కొనసాగుతోంది.

# గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లగా, అవాస్తవాలు, కల్పితాలతో నిండి ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు కొన్ని మెరుగులు దిద్ది చదివినట్లుగా ఉందని, రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి దశ, దిశ లేదని ఆమె ఎద్దేవా చేశారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి పాలనపై విజన్ గానీ, విజ్ఞత గానీ లేవని, సుపరిపాలన, సమతూకం మచ్చుకైనా కనిపించడం లేదని దుయ్యబట్టారు.

సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని షర్మిల విమర్శించారు. రూ. 33 వేల కోట్లతో వాటిని అమలు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా బూటకమని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న నిరుద్యోగ భృతి హామీ అడ్రస్ లేకుండా పోయిందని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది విద్యార్థులను, అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని, గోడ క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చే ఆడబిడ్డ పథకానికి దిక్కులేదని, కానీ 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి దానిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో చంపేశారని, 1.43 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అనేవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత అంటూ డ్రామాలు ఆడుతున్నారే తప్ప చేతల్లో అది కనిపించడం లేదని అన్నారు. కిలో రూపాయికి టమాటో, ఉల్లి అమ్ముకుంటున్న రైతులను పట్టించుకోకుండా, మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఆదుకున్నామని చెప్పడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ వైఖరిపైనా షర్మిల తీవ్రస్థాయిలో

ధ్వజమెత్తారు. ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఒక్కరోజు మురిపెం కోసం కాదని, మైకు ఇస్తేనే మాట్లాడతా అని మారం చేయడానికి అసెంబ్లీకి పంపలేదని అన్నారు. జగన్ తన సొంత అజెండాను పక్కనపెట్టి, ప్రజా అజెండాతో సభకు వెళ్లి అధికార పక్షాన్ని నిలదీయాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై, హామీలపై సభావేదికగా పోరాడాలని సూచించారు. శాసనసభకు వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే జగన్ తన ఎమ్మెల్యేలతో సహా రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు.

# మహారాష్ట్రలో దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డు..

ముంబై కోస్టల్ రోడ్ (ఎంసీఆర్పీ) లోని కొంత భాగం దేశీయ మొట్టమొదటి సంగీత రహదారిగా (మ్యూజికల్ రోడ్డు) మారింది. హంగేరియన్ టెక్నాలజీ సహకారంతో కోస్టల్ రోడ్డులోని నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే క్యారేజ్‌వేపై 700 మీటర్ల మేర పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహో' పాటను వినిపించనుంది.

ఈ పాటను దేశానికి అంకితం చేయడానికి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి ఈ విధంగా డిజైన్ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మ్యూజికల్ రోడ్డు ఈ మార్గం గుండా వాహనదారులను అలరిస్తుందని అన్నారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయినట్లు అధికారులు తెలిపారు.

ముంబై కోస్టల్ రోడ్డు

కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలుస్తుందని అన్నారు. ఇటువంటి మ్యూజికల్ రహదారులు హంగేరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో మాత్రమే ఉన్నాయని అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీనిని ఈరోజు ప్రారంభించారు.

# ఏం చేద్దాం శ్రీనివాస్?

- మొదటి పేజి తరువాయి

ఆయనను చూసిన జగన్ పలకరించారు. ఏం చేద్దాం శ్రీనివాస్? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని జగన్ ను దువ్వాడ కోరారు. దీంతో, తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని జగన్ ఆయనకు చెప్పారు. అక్కడి నుంచి తన కాన్వాయ్ ఎక్కి తాడేపల్లికి బయల్దేరారు. కొన్ని వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి దువ్వాడను బహిష్కరించారు. అప్పటి నుంచి పార్టీతో సంబంధం లేకుండా దువ్వాడ ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రం తప్పకుండా హాజరవుతున్నారు. ఈ క్రమంలో, ఈరోజు అసెంబ్లీని వాకౌట్ చేసి జగన్ వెళ్లిపోతున్న సమయంలో ఆయనకు దువ్వాడ ఎదురయ్యారు. జగన్ పలకరింపు అనంతరం మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ... త్వరలోనే జగన్ ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే, సొంతంగా పోటీ చేసి తన బలం చూపిస్తానని అన్నారు. శాసనమండలిలో తన వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళతానని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుల వైపు మాట్లాడతానని అన్నారు.

## ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి..

- మొదటి పేజి తరువాయి

'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది.అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు.

కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

- మొదటి పేజి తరువాయి

చేసుకుని విమర్శలు గుప్పించారు.

విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉండాలి. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు.

ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. వాళ్లు మనల్ని పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు: ఏపీ గవర్నర్ ప్రసంగం...

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. "గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. "2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ణా) గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని 'సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన'దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

## కుల ఐక్యతకు నిదర్శనంగా బలిజ భవన నిర్మాణం అడ్వాన్స్ చెక్కుతో ముందడుగు

శ్రీకాళహస్తి , పెన్ పవర్ , ఫిబ్రవరి 11 :
బలిజ భవన నిర్మాణ కేంద్రంలో శ్రీకాళహస్తి టౌన్ మరియు గ్రామీణ బలిజల అభివృద్ధికి నాలుగు స్థంభాల్లా ముందుండి నాయకత్వం వహిస్తున్న బలిజ కుల నాయకులు కోలా ఆనంద్, అంజూరు తారక శ్రీనివాస్, ముత్యాల పార్ధసారధి, శెట్టిపల్లి సురేష్‌లు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు నియమాల ప్రకారం ఎక్కడ ఎలాంటి కొలతలతో ఏ నిర్మాణాలు చేపట్టాలనే అంశాలపై వందలాది బలిజ పెద్దలు, యువ నాయకులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం ఏకగ్రీవంగా తీర్మానించి నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ చెక్కు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు.
ఈ నిర్ణయానికి బలిజ పెద్దలు, యువకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ హర్షధ్వనాలు వ్యక్తం చేశారు.



# గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 11.
బుచ్చిరెడ్డిపాలెం మండలం నాగమాంబాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామస్తులను సమస్యలను నేరుగా తెలుసుకున్నాడు తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు ముఖ్యంగా భూమి సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మరియు ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వినతి పత్రాలను అధికారులకు గ్రామస్తులు అందజేశారు. నాగమాంబాపురం గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. రెవెన్యూ విభాగం సిబ్బంది ప్రతి ఇంటికీ చేరువయ్యేలా ఈ సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ కార్యక్రమం గ్రామస్తులు తమ గోడును అధికారుల ముందు వెళ్లబోసుకున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనుల గురించి చర్చించారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజల దరిదాపుల్లోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. నాగమాంబాపురం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల బాట పట్టడం వల్ల పారదర్శకత పెరుగుతుందని ఆశిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాలెం రెవెన్యూ యంత్రాంగం ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొంది. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవడానికి ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వల్లూరు రాఘవరెడ్డి ర





## టిఆర్ఆర్ కాలేజీలో ఎన్‌సీసీ పునరుద్ధరణకు కృషి చేస్తున్న విపిఆర్ కు కృతజ్ఞతలు

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 11.
ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు అడిగిన వెంటనే కేంద్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నారుప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేస్తున్నారు ఎమ్మెల్యే ఇంటూరి, కాలేజీ ప్రిన్సిపల్ సిబ్బంది, విద్యార్థులుకందుకూరులోని ప్రముఖ టిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో రద్దయిన ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కట్టుబడి పనిచేస్తున్నారని, ఆయన కృషితో త్వరలోనే ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సమస్యను తెలిపిన వెంటనే స్పందించిన ఎంపీకి కళాశాల సిబ్బంది, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌సీసీ పునరుద్ధరణతో కళాశాలలో చదువుతున్న ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాల మెరుగుదల వంటి అనేక అంశాల్లో ఎన్‌సీసీ ఉపయోగపడుతుందని చెప్పారు. నేడు విద్యార్థుల కలలకు రెక్కలు వస్తున్నాయని, పోలీసు, ఆర్మీ, నేవీ వంటి రంగాల్లో రాణించేందుకు ఉపకరిస్తుందన్నారు.



## మదర్ థెరిసా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ప్రత్యేక అవగాహన

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 11,
గంగవరం మండలం లోని మదర్ థెరిసా డిగ్రీకళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ మీద అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరెస్పాన్డెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ..విద్యార్థులకు కెరీర్ పై అవగాహన కల్పించే దృక్పథంతో వివిధ ప్రభుత్వ రంగాలలో మరియు సివిల్స్ అండ్ గ్రూప్ పరీక్షలకు సంబంధించిన అవగాహన సదస్సును నిర్వహించామన్నారు. ఇందులో డాక్టర్ నాగరత్నంరెడ్డి తమ అమూల్యమైన సలహాలు సూచనలు చేస్తూ,డిగ్రీ తరువాత ఏవిధంగా ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాలో విద్యార్థులకు సలహాలు అందించారు. ఈ సందర్భంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు,డాక్టర్ నాగరత్నం రెడ్డిని విద్యార్థుల వేదికగా సన్మానించడం జరిగిందన్నారు



## సమ్మెను జయప్రదం చేయండి



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 11.
ఫిబ్రవరి 12న జరుగు అఖిల భారత జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున పిలుపునిచ్చారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొని వచ్చింది. రద్దుచేసిన పాత చట్టాలనే పునరుద్ధరించాలని సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం లోని బెజవాడ గోపాలరెడ్డి పార్క్ వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రదర్శన జరుగుతోంది. ఈ సమ్మెలో బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, టెలికం, ఆర్టీసీ రంగాల తో పాటుగా స్కీం వర్కర్లు అంగన్వాడి, ఆశా , భోజనం కార్మికులు అసంఘటిరంగా కార్మికులు ట్రాన్స్ పోర్ట్ రంగం, హమాలి, ఆటో, భవన నిర్మాణ కార్మికులు తోపాటుగా కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## భర్త వేధింపులు తాళలేక భార్యా ఆత్మహత్య

తిరుపతి,పెన్ పవర్ ఫిబ్రవరి 11.
తిరుపతి నగరంలోని ఆటో నగర్ లో నివాసముంటున్న ఓ మహిళను భర్త వేధించడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డ ఘటన చోటు చేసుకుంది. అలిపిరి ఎస్సై నరసింహారావు వివరాల మేరకు.... కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న మౌలిక ఉదయ్ భార్యాభర్తలు వీరికి 5,3,1, వయసున్న ముగ్గురు పిల్లలు. అయితే జల్సాలకు అలవాటు పడ్డ ఉదయ్ వేరే మహిళతో అక్రమ సంబంధం ఏర్పరుచుకుని భార్యను తరచూ వేధింపులు. నీవు చనిపోతే ఆమెను వివాహం చేసుకుంటానంటూ మద్యం సేవించి కొడుతూ ఉండేవాడు. విరక్తి చెందిన మహిళ మౌలిక(26) నివాసముంటున్న ఆటోనగర్ లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లి లక్ష్మీదేవి చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు,దీంతో అతనిపై అలిపిరి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి నిన్న ఇతని అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు వెల్లడించారు




# నకిలీ ఐపీఎస్ అరెస్ట్

**- ఉద్యోగం తీసిస్తానంటూ నిరుద్యోగి వద్ద 1.5 లక్షల నగదు కాజేత.**






తిరుపతి, పెన్ పవర్, జనవరి11.
ఐపీఎస్, ఎన్ ఐ ఏ అధికారి నందు నకిలీ ఐడెంటి కార్డులను చూపించి, నిరుద్యోగికి ఉద్యోగం తీసిస్తానంటూ 1.5 లక్షల నగదు కాజేసిన నకిలీ ఐపీఎస్ అధికారిని అరెస్టు చేశారు అలిపిరి పోలీసులు. పోలీసుల వివరాల మేరకు..,.. ఏలూరు జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు వృత్తిరీత్యా తిరుపతి సిమ్స్ ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీ సమయాల్లో రాపిడో డ్రైవర్ గా విధులు నిర్వహించేవాడు. అయితే ర్యాపిడో బుకింగ్ ద్వారా కె. సురేష్ కుమార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ఢిల్లీలో ఐపీఎస్ అధికారిగా ఉంటూ పదోన్నతపై ఎన్ఐఏ అధికారిగా హైదరాబాద్ కు బదిలీపై వచ్చానన్నారు. ప్రస్తుతం సెలవు పై ఉండడంతో చింతల చేనులో ఉన్న పిన్ని ఇంటికి వచ్చానని బాధితుడికి చెప్పాడు. కాగా ఆదాయపు పన్ను శాఖలో ఉద్యోగం తీసిస్తానంటూ నమ్మబలికి 1.5 లక్షల నగదు పలుసార్లు యూపీఐ అకౌంట్ ద్వారా కాజేశాడు. అనుమానం వచ్చిన వెంకటేశ్వరరావుకు అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు సురేష్ కుమార్ ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నకిలీ ఐపీఎస్ అధికారి విషయం బట్టబయలైంది. అతడి వద్ద నుండి వద్ద నుండి వివిధ పోలీస్ యూనిఫామ్ తో కూడిన ఫోటోలను ఐడి కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు అలిపిరిఎస్ఐ నరసింహ రావు తెలిపారు.




# రైతుల బాధలు వర్ణనాతీతం -కాకాణి

పొదలకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 11.శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాసర్వేపల్లి నియోజకవర్గం , పొదలకూరు మండలంలోని మొగుళ్ళూరు గ్రామం తో పాటు, మనుబోలు మండలంలోని కట్టువపల్లి, మడమనూరు, గొట్లపాలెం, గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి యూరియా దొరకక అల్లాడిపోయామని కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన రైతులు పంటలకు కనీసం మద్దతు ధర కల్పించేందుకు, రైతులకు అండగా నిలవాలని, కాకాణి కి విజ్ఞప్తి చేసిన అన్నదాతలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, ధర్మరాజు పాలన అంటూ ప్రశంసించిన రైతులు కాకాణి స్క్రోలింగ్ పాయింట్స్కూటమి పాలనలో రైతుల బాధలు వర్ణనాతీతం యూరియా అందక రైతులు పడ్డ బాధలు అన్నీ ,ఇన్నీ కావు!తెలుగు దేశం పార్టీ వారు యూరియాని తమ ఇళ్లకు తరలించుకొని పోయి ,అధిక ధరలకు బ్లాక్ లో విక్రయించి సొమ్ము చేసుకోవడం దుర్మార్గం సోమిరెడ్డి ఇరిగేషన్ లో పనులు చేయకుండా దొంగ బిల్లులు చేసుకుంటుంటే, ఆయన శిష్యులు యూరియాను బ్లాక్ లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు రైతులను అడ్డుపెట్టుకొని దోచుకుంటున్న, దుర్మార్గమైన ప్రభుత్వం ,కూటమి ప్రభుత్వం రైతులకు పంట చేతికొస్తున్న సమయాన కనీస మద్దతు ధర తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే ప్రభుత్వం మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి, రైతుల దగ్గర నుండి పంట కొనుగోలు చేయకపోతే, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదు రైతుల దగ్గర నుండి కనీసమద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేంతవరకు , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రైతులకు అండగా నిలిచి పోరాడుతాంకూటమిపాలనలో కొత్త పెన్షన్లుమంజూరు కాక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ,తీవ్ర అవస్థల పాలవుతున్నారు సోమిరెడ్డి మాత్రం ప్రభుత్వం మంజూరు చేయలేదని తెలిసి కూడా, వాస్తవాలు దాచిపెట్టి అధికారులపై చిందులు వేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు కూటమి ప్రభుత్వంలో అబద్ధాలు, అక్రమాలు, అవినీతి తప్ప, అభివృద్ధి ,సంక్షేమం ,మచ్చుకైనా కనిపించడం లేదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గ్రామాలకు రహదారులు, గ్రామాలలో అంతర్గత సిమెంట్ రోడ్లు, సంపూర్ణంగా నిర్మించాం కూటమి పాలనలో గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ గుంతలమయం అయిపోయాయి చంద్రబాబుకు పాలన చేతకాక, హామీలు అమలు చేయలేక ,డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు కూటమి ప్రభుత్వం 19 నెలల పాలనలో తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది జగన్మోహన్ రెడ్డి రైతులకు అండగా నిలిచిన విధానాన్ని ప్రజలు ఇప్పుడు గుర్తుకు తెచ్చుకొని చర్చించుకుంటున్నారు
జగన్మోహన్ రెడ్డి పాలన లేకపోవడం వలన, తాము అంతా తీవ్ర ఇబ్బందుల పాలయ్యామని ,అన్ని వర్గాల ప్రజలు గ్రహించారు ఆంధ్ర రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా, తిరిగి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రైతులకు ,అన్ని వర్గాల



ప్రజలకు ,సమస్యలు రాకుండా మెరుగైనటువంటి వసతి సదుపాయాలు అందించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ,చిత్తశుద్ధితో పోరాడుతాం యనమల వెంకట రమణారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి, ఇటీవల తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన సన్నారెడ్డి జానకి రామి రెడ్డి పసల శంకరయ్య, పద్మావతి,యాలపల్లి నరేంద్ర,ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు ను పరామర్శించిన కాకాణి



# రైల్వేల్లో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల వివరాలు తెలుపండి...

## -రైల్వే ట్రాక్‌ల వెంట, స్టేషన్ల పరిసరాలలో పేరుకుపోతున్న చెత్త...
## - పార్లమెంటులో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి: ఫిబ్రవరి 11, పెన్ పవర్

రైల్వేల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యపై తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ రైల్వే ట్రాక్‌ల వెంట, స్టేషన్ల పరిసరాల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఆహార ప్యాకెట్లు తదితర వ్యర్థాలు వేస్తున్న పరిస్థితిని ఆయన ప్రస్తావించారు. రైళ్లలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఈ సమస్య ఎందుకు కొనసాగుతోందని, వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్లాస్టిక్ చెత్తను ట్రాక్‌లపై వేయకుండా పర్యవేక్షణ వ్యవస్థ, జరిమానా విధానం ఉందా అనే అంశాలపై వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ రైల్వేల్లో వ్యర్థాల నిర్వహణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైళ్లలో సేకరించిన చెత్తను మార్గమధ్యంలో గుర్తించిన స్టేషన్లలో శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రైళ్లలో పనిచేసే హౌస్‌కీపింగ్ సిబ్బందికి ట్రాక్‌లపై చెత్త వేయరాదని కఠిన ఆదేశాలు జారీ చేశామని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ట్రాక్‌ల వెంట రాగ్ పికింగ్ ద్వారా నిరంతర శుభ్రత నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టేషన్లలో బయోడిగ్రేడబుల్, నాన్–బయోడిగ్రేడబుల్ వ్యర్థాల వర్గీకరణ కోసం రెండు బిన్‌ల విధానం అమలు చేస్తున్నామని అన్నారు. అవసరాన్ని బట్టి ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మున్సిపల్ సంస్థలతో కలిసి వ్యర్థాల నిర్వహణకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అవసరమైన చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు, వర్క్‌షాపులు, లోకో షెడ్లలో నుంచి వచ్చే రసాయన మలిన జలాల శుద్ధి కోసం ఎఫ్లువెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, అలాగే మెటీరియల్ రికవరీ ఫెసిలిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రయాణికుల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, డివిజనల్, జోనల్, హెడ్‌క్వార్టర్ స్థాయిలో రెగ్యులర్, ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.



స్వచ్ఛ భారత్ అభియాన్ కింద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రయాణికుల కోచ్‌లలో బయో టాయిలెట్ల ఏర్పాటు ద్వారా ట్రాక్‌లపై మానవ వ్యర్థాల ప్రత్యక్ష విడుదలను పూర్తిగా నిలిపివేశామని వెల్లడించారు. 2004 నుండి 2014 వరకు 9,587 బయో టాయిలెట్లు ఏర్పాటు చేయగా, 2014 నుండి ఇప్పటివరకు 3,61,572 బయో టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

# ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 11.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు కోవూరు నియోజకవర్గ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో పాల్గొన్న ఆమె ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి మరియు సంక్షేమ ప్రణాళికలను స్వాగతించారు. రాష్ట సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్ దిక్సూచిగా మారుతుందని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ముఖ్యంగా మహిళా సంక్షేమం మరియు గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు

# శ్రీకాళహస్తిలో శివమాలతో దీక్షలు ప్రారంభం
## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులు, వైఎస్ఆర్‌సీపీ నేతలు





శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,ఫిబ్రవరి ,11 :

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శుభ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారి శివమాలతో దీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శివదీక్షలు స్వీకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివదీక్ష మాలలు ధరించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుల్లెట్ జై శ్యామ్ రాయల్, కోవి చంద్రయ్య నాయుడు, ఆర్కార్డ్ ముత్తు, శ్రీరాములు గౌడ్, నారాయణ, గంగాధరం, కుమార్, యోగ, అమర్, బలరాం, మనీ, జీవీకే రెడ్డి, దినేష్, సతీష్, సురేష్, మాస్ సురేష్, సాయి, సుధీర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలి..

## - యూనివర్సిటీ నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలి

తిరుపతి: ఫిబ్రవరి 11, పెన్ పవర్



తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీలో అధిక ఫీజులను నియంత్రించాలని ఉన్నత విద్య నియంత్రణ మరియు పర్యవేక్షణ కమీషన్ కార్యదర్శి సూర్య చంద్ర రావుకి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులు బి. రవి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం విద్యార్థుల వద్దనుండి అధిక ఫీజులు వసూల చేస్తున్నారనే ఆరోపణతో కమీషన్ పరిశీలించి రూ. 26.7 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేశారని నివేదిక ఇచ్చారు. 15 లక్షలు ఫైన్ కూడా వేశారని గుర్తు చేశారు. కమిషన్ వేసిన ఫైన్ ను యాజమాన్యం చెల్లించింది కానీ విద్యార్థులకు మాత్రం పంగ నామాలు పెట్టింది అని, తిరిగి చెల్లించాల్సిన ఫీజులు ఇవ్వలేదని, ఇప్పటికైనా అందించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం కూడా ఎంసెట్ ద్వారా అర్హత సాధించిన ఒక్కో విద్యార్థి నుండి 'కెరీర్ డెవలప్‌మెంట్' పేరుతో అదనంగా రూ. 40వేల వసూలు చేస్తున్నారని దీనిని ఆదియోగి యాప్ పోర్టల్ ద్వారా పేమెంట్స్ వసూళ్ళు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా హాస్టల్లో ఉన్న లేకపోయినా రూ. 20వేలు మొత్తం రూ.60వేలు ఖచ్చితంగా చెల్లించాల్సిందేనని లేని పక్షంలో పరీక్షలు మరియు ప్రాజెక్ట్ వర్క్ నిలుపుదల చేస్తున్నారని వివరించారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం అని విద్యార్థుల వద్ద నుండి అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా వారి అకడమిక్ స్వేచ్ఛను దెబ్బతీసే విధంగా ఉందని వాపోయారు. గతంలో చర్యలు తీసుకున్నా మరల అదే దారిలో వెళ్తున్నారని ఈ విద్య సంవత్సరం కూడా అధిక ఫీజులపై కమిషన్ నియమించి నియంత్రించాలని కోరారు. పదే పదే అక్రమాలకు పాల్పడుతున్న ఎంబియు యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిర్వహించాలని విన్నవించారు.

# ముక్కంటి ఆలయానికి గాజుల విరాళం
## మహాశివరాత్రికి ముందస్తు భక్తి కానుక

శ్రీకాళహస్తి , పెన్ పవర్ , ఫిబ్రవరి,11 :



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముక్కంటి శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి ఏర్పేడు మండల మాజీ అధ్యక్షుడు నైనారు పొన్నారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి చేతుల మీదుగా గాజులను ఆలయ కార్యనిర్వహణ అధికారి టి. బాపిరెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా దేవస్థానం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పుష్పా తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్.

## - ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు మరో ఇద్దరు చిత్తూరువాసులు అరెస్ట్.
## -1.65కోట్ల విలువైన 72 ఎర్రచందనం దొంగలు స్వాధీనం.

తిరుపతి,పెన్ పవర్, ఫిబ్రవరి 11.





పుష్పాతరహాలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్న స్మగ్లర్లను వెంటాడి వేటాడి పట్టుకున్నారు రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు. ఇద్దరు అంతర్రాష్ట్ర ఎర్రచందనం మగ్లర్లతోపాటు ఇద్దరు చిత్తూరు వాసులను అరెస్టు చేశారు. 1.65 కోట్ల విలువైన ఏ గ్రేడ్ 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ అధికారి ఎల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ..... అన్నమయ్య జిల్లా, సుందుపల్లి మండలం,పింఛా ప్రాజెక్టు వద్ద సమీపంలో బుధవారం తెల్లవారి జామున పెద్ద ఎత్తున స్మగ్లింగ్ జరుగుతుందని సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేయడం జరిగిందన్నారు. పారిపోవడానికి ప్రయత్నించడంతో వెంటాడి వేటాడి వారిలో 4 గురు ని పట్టుకోవడం జరిగిందన్నారు. మరి కొంతమంది అటవీ ప్రాంతంలోకి పారిపోయారన్నారు. టాక్టర్ లో రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న 72 దుంగలు సీజ్ చేయడం జరిగింది అన్నారు, పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన ఇరువురు కాగా మరో ఇద్దరూ చిత్తూరు జిల్లా వారిగా గుర్తించి అరెస్టు చేయడం జరిగిందన్నారు ప్రధాన స్మగ్లర్ కోసం దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు. పట్టుబడ్డ ఎర్రచందనం దుంగల విలువ కోటి 65 లక్షల పైగా ఉంటుందని తెలిపారు. రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఏ ఎస్ పి కులశేఖర్ ఆధ్వర్యంలో కొనసాగిందని ఈ ఆపరేషన్లో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి రివార్డులు ప్రకటించడం జరిగిందన్నారు




# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మీడియా సేవలు
## భక్తులకు సమాచార వంతెనగా పాత్రికేయులు



శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి ,11 :

శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తూ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్థానికంగా పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాత్రికేయ మిత్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

భక్తుల రద్దీ మధ్య కూడా కార్యక్రమాల విశేషాలు, ఆలయ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమాచారాన్ని ప్రజలకు వెంటనే చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించింది. దేవస్థాన అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా కవరేజ్ నిర్వహించిన పాత్రికేయుల సేవలను పలువురు ప్రశంసించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా సాగడంలో మీడియా సహకారం ఎంతో విలువైనదిగా నిలిచింది.

# కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అత్యధిక వ్యతిరేకత మొదలయ్యింది

## - మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 11,
దేశంలోనే మొట్టమొదటి సరిగా ఎప్పుడూ లేనంతగా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అత్యధిక వ్యతిరేకత మొదలయ్యిందని,కాగా
జగన్మోహన్ రెడ్డిని సీఎం చేసుకోవడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్ కోరారు.బుధవారం పట్టణంలోని ఓప్రైవేటు ఫంక్షన్ హాల్ వద్ద ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్సీపీ సంస్థాగత నిర్మాణ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి హాజరయ్యారు.ఈసందర్భంగా వెంకటేగౌడ మాట్లాడుతూ..గ్రామ, మండల,నియోజకవర్గ స్థాయి కమిటీలకు వైఎస్ఆర్సిపి తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. పంచాయతీలుగా యూనిట్ గా గ్రామ కమిటీ నియామకాలు చేపట్టాలని,రానున్న రోజుల్లో గ్రామకమిటీలు క్రియాశీలకం కానున్నాయన్నారు.
గ్రామకమిటీలో 9మంది సభ్యులతో పాటు,7 అనుబంధ కమిటీల్లో 5నుంచి 10 మంది సభ్యులను నియమించాలని, కమిటీల్లో సోషల్ మీడియా కన్వీనర్ పాత్ర అత్యంతం కీలకంగా ఉంటుందని,ప్రతి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని,ఇలా మొత్తంగా ఒక్కో పంచాయతీలో 70 నుంచి 100 మంది వరకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.ఫిబ్రవరి 18లోగా గ్రామకమిటీల ఎంపిక పూర్తి చేయాలని,రెండు పంచాయతీలకు ఒక కోఆర్డినేటర్ను నియమించాలని, కమిటీల్లో నియామకమైన వ్యక్తుల కు గుర్తింపు కార్డులు జారీచేయడంతో పాటు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తామని,రానున్న రోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు ఈకమిటీ సభ్యుల ద్వారానే అమలు చేయిస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు.

**రెడ్ బుక్ బెదిరింపులకు భయపడేది లేదు**

జగన్మోహన్ రెడ్డి పాలనలో చేసిన మంచిని చెప్పుకోక పోవడంతోనే గత ఎన్నికల్లో ఓడిపోయామని,ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ బెదిరింపు లకు తమపార్టీ నాయకులు,కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని వెంకటేగౌడ స్పష్టం చేశారు.నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అనుచరుల పాపాలు ఎక్కువగా ఉన్నాయని, గ్రామాల్లో కూటమి నేతలదే బెల్టుషాపులు



ఎక్కువగా ఉన్నాయని, ప్రతి పనికీ భారీగా వసూళ్లు చేపడుతున్నారని,అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయలేదని ఆయన దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప,చవ్వా రాజశేఖరరెడ్డి,వెంకటరెడ్డి యాదవ్,పట్టణ అధ్యక్షులు హేమంత్ కుమార్ రెడ్డి,చెంగారెడ్డి, మురళి,రెడ్డప్ప,యువరాజు,పి.ఎన్.నాగరాజు, కృష్ణమూర్తి,గంగవరం అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,ప్రహ్లాద,చంద్రప్ప,కరెస్పాన్డెంట్ కృష్ణమూర్తి రెడ్డి,మంజునాథరెడ్డి,రమేష్ రెడ్డి,రెడ్డిప్రసాద్, మరియు నియోజకవర్గ అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



# మిన్నల్ రవి జన్మదిన వేడుకల్లో ఘనంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి ,11:
గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు తమ్ముళ్లు ఘనంగా శు భాకాంక్షలు తెలిపారు.బీసీ వర్గాలకు ఆత్మీయ సోదరుడిగా గుర్తింపు పొందిన మిన్నల్ రవిని, బుధవారం స్థానిక పూసల వీధిలో కేక్ కట్ చేయించి దుశ్శాలువాతో సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను తన కుటుంబ సభ్యుల్లా భావిస్తూ, అందరి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ఆయనను ప్రశంసించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు, బీమాల భాస్కర్ ముదిరాజ్, డి.వి. నారాయణ, వజ్రం కిషోర్, చిల్లకూరు మణి, కోట చంద్రశేఖర్, హరి, ముని రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్, పూల శేఖర్, షేక్ ఖాదర్, చందు, గంగనపల్లి రమేష్, కృష్ణమూర్తి, సయ్యద్ ఆదిల్, ప్రభాకర్, సులేమాన్, పోలూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

## శ్రీకాళహస్తి ఆలయం ఆధ్యాత్మిక కాంతులతో కళకళ

శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,ఫిబ్రవరి,11:
శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య పూజారులు సంప్రదాయ పద్ధతుల్లో ధ్వజారోహణం నిర్వహించగా, భక్తులు "ఓం నమః శివాయ" నినాదాలతో ఆలయాన్ని మార్మోగించారు.
ఈ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఉత్సవాలు మొత్తం ఇరవై నాలుగు రోజుల పాటు ఘనంగా కొనసాగనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వాహన సేవలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భద్రతా చర్యలు పటిష్టం చేయడంతో పాటు తాగునీరు, ప్రసాద వితరణ, దర్శన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీకాళహస్తికి తరలివస్తుండటంతో ఆలయం భక్తి వాతావరణంతో కళకళలాడుతోంది.
ఈ బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమే కాకుండా శ్రీకాళహస్తి ప్రాంతానికి ప్రత్యేక శోభను తీసుకువస్తున్నాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులకు శక్తి యాప్ మరియు సామాజిక అవగాహన కార్యక్రమం.



తిరుపతి/ పెన్ పవర్/ ఫిబ్రవరి 11
– తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్., గారి ఆదేశాల మేరకు మహిళా పోలీసు బృందం తిరుపతి, రేణిగుంట లలో గల డిగ్రీ కళాశాలల విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఉపయోగాలు, యాప్ డౌన్‌లోడ్ విధానం గురించి వివరించి, అత్యవసర పరిస్థితుల్లో "శక్తి యాప్" ఎలా సహాయపడుతుందో తెలియజేశారు.అదేవిధంగా లోన్ యాప్ మోసాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, గుర్తుతెలియని లింకులు మరియు వీడియో కాల్స్ పట్ల జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ ప్రమాదాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు.
ఇంకా మంచి స్నేహాలు, మంచి అలవాట్లు, విద్య యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలు, అత్యవసర టోల్ ఫ్రీ నంబర్లు, సెల్ ఫోన్ మరియు సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. అలాగే బాల్యవివాహాల నివారణ, మహిళలపై జరుగుతున్న నేరాలు మరియు మహిళల అక్రమ రవాణా (ఔశీఎవఆ ఎతీఋటటఱఎఎఆఅస్త్ర) వంటి సమాజంలో జరుగుతున్న తాజా ఘటనలపై విద్యార్థులను అప్రమత్తం చేశారు.విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా మారాలని, ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు ఎదురైన వెంటనే పోలీసు హెల్ప్ లైయిన్ 112 కి సమాచారం ఇవ్వాలని సూచించారు.



# మహాశివరాత్రి వేడుకల సందర్భంగా తిరుణాల తిప్ప కాశీనాయన ఆశ్రమంలో భద్రతా ఏర్పాట్లపై డి.ఎస్.పి. సమీక్ష

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 11.
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుణాల తిప్ప కాశీనాయన ఆశ్రమాన్ని డి.ఎస్.పి. కె. వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్, ఎస్సై జిలాని, మర్రిపాడు ఎస్సై శ్రీనివాసులు మరియు వారి సిబ్బంది ఆశ్రమ పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు.
ఉత్సవాల కారణంగా భక్తుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో భద్రతా చర్యలను అధికారులు దగ్గరుండి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్, రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.
మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డి.ఎస్.పి. తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని స్పష్టం చేశారు.

# ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 11.
బుచ్చిరెడ్డిపాలెం సమీపంలోని జొన్నవాడ వద్ద పెన్నా నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ ఒక్కసారిగా ఇండియన్ స్టార్ట్ చేయడంతో కిందపడి ఇసుకలో కూరుకుపోయిన స్థితిలో మృతి చెందాడు పెనుబల్లి గ్రామానికి చెందిన షేక్ రసూల్ అనే వ్యక్తి పెన్నా నదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం జరిగేది ఈ నేపథ్యంలోనే బుధవారం కూడా ఒంటరిగా పెన్నా నదిలోకి వెళ్లి లోడ్ చేసుకున్నానంతరం తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ కింద పడడంతో చక్రాల కింద ఇసుకలో కూరుకు పోయాడు వెలికి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది సీఐ శ్రీనివాసరెడ్డి ఎస్ఐ సంతోష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శివపరీక్ష నిమిత్తం వైద్యశాలకు తరలించారు

# మహాశివరాత్రి వేడుకల్లో సేవకులకు ఎస్బీఐ కానుకలు రిషితా రెడ్డి చేతుల మీదుగా అందజేత



శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,ఫిబ్రవరి ,11:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీపాద సేవకులకు ఎస్బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో సుమారు రూ.2 లక్షల విలువగల 200 పంచలు, టీషర్టులను విరాళంగా అందజేశారు.ఈ విరాళాలను శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట్ సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి చేతుల మీదుగా శ్రీవారి సేవకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణ రెడ్డి, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ స్వామి, ఏజీఎం శ్రీనివాసులు రెడ్డి, మైన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఫణికుమార్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# మహాశివరాత్రి వేడుకల్లో భగవద్గీత ఘోష -ఆకట్టుకున్న చిన్నారి ప్రవాసిని



శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,ఫిబ్రవరి, 11 :
శ్రీకాళహస్తిలోని శ్రీ కాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధూర్జటి కళా ప్రాంగణంలో ప్రత్యేక భగవద్గీత మరియు శివ రుద్ర పారాయణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన చిన్నారి ఏం. ప్రవాసిని భగవద్గీత శ్లోకాలను శుద్ధంగా పఠిస్తూ, వాటి భావార్థాలను ఆంగ్లంలో సులువుగా వివరించడంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు.
ఆధ్యాత్మిక భావనలతో నిండిన ఆమె ప్రసంగం ప్రేక్షకులను భక్తి భావంతో ఉప్పొంగేలా చేసింది. కార్యక్రమం అనంతరం ఆలయ అధికారుల తరపున శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యుడు దండు రాఘవయ్య చిన్నారిని బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ మరియు ప్రసాదంతో సత్కరించారు.
పిల్లల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ, సనాతన ధర్మ విలువలను ముందుకు తీసుకెళ్లిన ఈ కార్యక్రమాన్ని భక్తులు, హాజరైన ప్రముఖులు హర్షాతిరేకాలతో ప్రశంసించారు.



# అన్నదాన మహాయజ్ఞానికి శ్రీకాంత్ బూడిరాజు రూ.50,000 విరాళం

శ్రీకాళహస్తి, పెన్ పవర్ , ఫిబ్రవరి ,11 :
వైజాగ్‌కు చెందిన భక్తుడు శ్రీకాంత్ బూడిరాజు గారు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానముచే నిర్వహించబడుతున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50,000/-ల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.భక్తుల సేవాభావానికి ప్రతీకగా అందిన ఈ విరాళాన్ని దేవస్థానం అధికారులు కృతజ్ఞతలతో స్వీకరించారు. ఈ సందర్భంగా దాతకు అంతరాలయ ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు వేద పండితుల ద్వారా వేద ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు.



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి అనుగ్రహంతో మరెన్నో సేవాకార్యక్రమాలు కొనసాగాలని ఆలయ అధికారులు ఆకాంక్షించారు.

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు శ్రీ పల్లా శ్రీనివాసరావు విజయవాడలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశాను.

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 11.
ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, APEMCL డైరీని అందజేశాను. కార్పొరేషన్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించాం
కార్పొరేషన్ నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం కు మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో మరింత కృషి చేయాలని ఆయన సూచించారు.అలాగే తంబళ్లపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న కమిటీ కార్యక్రమాలపై కూడా సవివరంగా చర్చించడం జరిగింది.పోలంరెడ్డి దినేష్ రెడ్డి
APEMCL చైర్మన్



## శేష వాహనంపై కపిలేశ్వరుడు

తిరుపతి పెన్ పవర్ ఫిబ్రవరి 11
తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం రాత్రి శ్రీ కపిలేశ్వరస్వామివారు కామాక్షి అమ్మవారి సమేతంగా శేష వాహనంపై అభయమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. వేంకటాచలంపై శిలలన్నీ ఆదిశేషుని పడగలే. శ్రీకూర్మం మీద ఆదిశేషుడు ఆ ఆదిశేషునిపై భూమండలం ఆ భూమిని ఛేదించుకుని పైకి వచ్చిన పాతాళ మహాలింగం కపిలమహర్షిచే పూజింపబడింది. ఆ లింగం వెలసిన ఈ ప్రదేశం కైలాసం వంటి మహిమాన్విత దివ్యక్షేత్రం. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## పి.ఆర్. గెస్ట్ హౌస్ ఎదుట "ఐ లవ్ శ్రీకాళహస్తి" ఏర్పాట్లను పరిశీలించిన ఏఈ పట్టణ సౌందర్యానికి కొత్త ఆకర్షణ

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి ,11:
శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని పి.ఆర్. గెస్ట్ హౌస్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న "ఐ లవ్ శ్రీకాళహస్తి" సైన్‌బోర్డు పనులను సంబంధిత శాఖ ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) స్వయంగా పరిశీలించారు.
పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా ఈ ఏర్పాటు పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు ఏ ఈ సూచించారు. పర్యాటకులకు ఫోటో స్పాట్‌గా మారేలా డిజైన్, లైటింగ్, భద్రత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం పూర్తయితే శ్రీకాళహస్తి నగరానికి మరింత అందం చేకూరడమే కాకుండా, భక్తులు, పర్యాటకులకు మధుర జ్ఞాపకంగా నిలవనుందని అధికారులు తెలిపారు.



# చీపురు పట్టిన చేతులే.. గరిటె పట్టాయి..

### -అధికారుల్లారా కళ్ళు తెరవండి...-మురికిలో మేం ముసుగులో మీరా...
### -రేణిగుంట పారిశుద్ధ్య కార్మికుల దీనగాథ....









రేణిగుంట: ఫిబ్రవరి 11, పెన్ పవర్.
గ్రామాల స్వచ్ఛత కోసం అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం కళ్ళున్న చూడలేని గుడ్డివాడిలా వ్యవహరిస్తుందనీ ఏఐటీయూసీ తిరుపతి జిల్లా కార్యదర్శి ఘాటుగా విమర్శించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మేజర్ పంచాయతీలో 95 మంది కార్మికుల జీవితాలు నేడు రోడ్డున పడ్డాయి. వేతనాలు పెంచకపోగా కనీస సౌకర్యాలు కల్పించకుండా డివిజనల్ పంచాయతీ అధికారిని వారి పొట్ట కొడుతున్నారని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిరసన కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు.

చీపురు పట్టిన చేతులే గరిటె పట్టాయి..

తమ గోడును అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయిన కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి వినూత్నంగా తమ నిరసనను తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం -- కార్మికుల ఆవేదన..

పెరుగుతున్న ధరల దృష్ట్యా జీతాలు పెంచాలని అడిగితే డివిజనల్ పంచాయతీ అధికారి ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. ఏఐటీయూసీ మహిళా నాయకురాలుగా పనిచేస్తున్న కార్మికురాలిని ఉద్యోగం నుండి తీయించి వేస్తామని హుకుం జారీ చేశారు. ఆమెకు నాలుగు నెలలుగా జీతం రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సర్పంచ్ నగేష్ తన్న పెన్షన్ నుండి 11800 కార్మికురాలికి అందజేశారు. ఇలా అప్పులు చేసుకుంటూ కార్మికులు తమ కుటుంబాలను కాపాడుకుంటున్నారు.

భద్రత లేని బతుకులు..

రోజు మురికిలో పనిచేసే తమకు కనీసం చేతులు కడుక్కోవడానికి సోపులు ఒంటికి నూనె డ్యూటీ డ్రెస్సులు కూడా ఇవ్వడం లేదని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ఈఎస్ఐ కార్డు ఏది. పనిచేస్తూ అనారోగ్యం పాలైతే దిక్కులేదు ఇప్పటికీ వీరికి ఈఎస్ఐ కార్డు కానీ కనీసం పంచాయితీ ఐడి కార్డు కానీ మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ ఆందోళన సెగ రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తుందని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వైయస్ మనీ ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తిక్ పారిశుద్ధ్య కార్మికుల నాయకుడు రమణ సుబ్బరాజు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ ఏరియాలో పండిట్ ధీన దయాల్ ఉపాధ్యాయ సంస్మరణ

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 11.
ఈరోజు కోవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ ఏరియాలోని టెంకాయ తోపు ఏరియాలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 57వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఆలూరు నాగవేణి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పార్లపల్లి మహేష్ నాయుడు, మహిళా మోర్చా అర్బన్ అధ్యక్షురాలు జడపల్లి రవణమ్మ, బీజేవైఎం అర్బన్ అధ్యక్షులు తానా మణికంఠ, అర్బన్ కార్యదర్శులు గాదంశెట్టి సురేష్, బొందిలి శాలిని రాణి, కాసా వెంకట్ నాగార్జున్, మరియు నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు ప్రజలు పాల్గొన్నారు





## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకి ఘనంగా నివాళులు

(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు ఫిబ్రవరి 11)
భారతీయ జనసంఘ్ నాయకుడిగా, రాజకీయ తత్వవేత్తగా, "ఏకాత్మ మానవతావాదం" సిద్ధాంత ప్రతిపాదకుడిగా పండిట్ జీ చేసిన సేవలు చిరస్మరణీయం అని వింజమూరు బిజెపి మండల అధ్యక్షులు అంబటీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు సమర్పణ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.
సమాజ సమగ్ర అభివృద్ధి, ఆత్మనిర్భరత, సమతుల్య మానవ వికాసం వంటి విలువలను ప్రతిపాదించిన ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం.
దేశ నిర్మాణంలో సిద్ధాంతాల కోసం అంకితభావంతో పనిచేసిన ఆ మహనీయుని స్ఫూర్తిని అందరూ ఆచరణలో పెట్టాలి.
ఈ కార్యక్రమం లో నాయకులు గని రమణయ్య, మల్లం కొండా రెడ్డి, డి నారాయణ రెడ్డి, జి మహేశ్వర్, ఎస్ సుధాకర్, డి ప్రసాద్, శ్రీనాద్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తుడా అభివృద్ధి పనులపై కలెక్టర్,తుడా చైర్మన్, వైస్ చైర్మన్ సమీక్షా సమావేశం

తిరుపతి పెన్ పవర్ ఫిబ్రవరి 11
తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్లతో కలిసి తుడా పరిధిలోని పలు కీలక అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రధానంగా చెరువుల సుందరీకరణ, మాస్టర్ ప్లాన్ రోడ్లు మరియు తుడా టవర్స్ నిర్మాణ పనులపై చర్చించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అవిలాల చెరువు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యతనిస్తూ, వేసవి కాలం లోపే పనులు ప్రారంభించాలని తుడా చైర్మన్ మరియు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ: పేరూరు చెరువు నుండి అవిలాల చెరువు 5 కిలోమీటర్ల ఛానల్ అభివృద్ధికి,చెరువు బండ్ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు.
14 మీటర్ల వెడల్పుతో వాకింగ్ మరియు జాగింగ్ ట్రాక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, మరియు పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి స్పీడ్ బోట్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.
శెట్టిపల్లి లేఅవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు, వాటర్ ట్యాంకులు, ఎస్.టి.పి మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై సమీక్షించారు.
తుడా టవర్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ప్లాస్టరింగ్ మరియు సబ్ స్టేషన్, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆదేశించారు.
కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ: మొదటి దశలో అవిలాల చెరువుతో పాటు కరకంబాడి మరియు శెట్టిపల్లి చెరువులను అభివృద్ధి చేయనున్నారు,ఓటేరు చెరువును తుడా ఆధ్వర్యంలో రక్షించాలని సూచించారు.వచ్చే మార్చి నాటికి వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు ఆదేశాలిచ్చారు.
దీనికి సంబంధించి ఒక నెలలోపు పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
జాయింట్ కలెక్టర్,తుడా వైస్ చైర్మన్ ఆర్ గోవింద రావు మాట్లాడుతూ: తిరుపతి నగరంలో వరద ముప్పును తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ స్టార్మ్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయాలని, తద్వారా తుడా పరిధిలో వరద నియంత్రణ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు.
ఇందుకు సంబంధించి నీటి పారుదల శాఖతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని తుడా అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు ఎస్ ఈ రవీంద్రయ్య, చీఫ్ ప్లానింగ్ అధికారిని దేవికుమారి భూసేకరణ అధికారిణి సుజన, తుడా అధికారులు,ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆ ప్రాంతాలు.. ఇక సూపర్

**నెల్లూరు, ఫిబ్రవరి 11, పెన్ పవర్:** రాష్ట్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను 4 వరుసలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్గంలో రైల్వే లైన్లు పెరగడం ద్వారా సరకు రవాణా వేగవంతంగా చేయవచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 774 రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మించి, రైల్వే గేట్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హైదరాబాద్-అమరావతి- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు వంటి బుల్లెట్ రైలు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల ఏపీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని సీఎం చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. రైల్వేతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఉన్న కారణంగా, అందుకు అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ఫోకస్ చేయాలని సూచించారు. గడువులోగా భూములు సేకరించేందుకు ప్రయత్నించాలని, తమకు సంబంధం లేదు అనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదని మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు సూచించారుప్రస్తుతం ఉత్పత్తుల రవాణా ఖర్చు సగటున 14 శాతంగా ఉందని, దీనిని 7 నుంచి 8 శాతానికి తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి అవుతుండగా, రాబోయే ఐదేళ్లలో దీనిని 1,000 లక్షల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అనంతపురం నుంచి అరటిపండ్ల రవాణా తరహాలోనే అన్ని రకాల పంటల ఎగుమతుల కోసం మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే సీ ప్లేన్ల నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు రూ. 5.18 ఉన్న వ్యయాన్ని ఎలాగైనా సరే రూ. 4 లోపు (రూ. 3.90) తీసుకురావడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజీ, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఒకే దగ్గర ఉండేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కేలా చూస్తామన్నారు. గతంలో నీటి కొరత, విద్యుత్ కొరత అధికంగా ఉండేది. ఇప్పుడు వాటిని అధిగమించామన్నారు.పర్యావరణ హితం కోసం ఆర్టీసీలో 1,000 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక్క మీటరు పెరగడం ద్వారా మనకు రూ.4 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, నిర్లక్ష్యం లేకుండా కలెక్టర్లు, అధికారులు పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్ధశ

**విజయవాడ, ఫిబ్రవరి 11, పెన్ పవర్:** మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## వేటు కోసం కొలికపూడినిరీక్షణ



**విజయవాడ, ఫిబ్రవరి 11, పెన్ పవర్:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్ట్‌లు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది.కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి.కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు.

వేటు కోసం కొలికపూడి వ్యవహారం కేవలం ప్రజా సమస్యలకే పరిమితం కాలేదు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై ఆయన చేసిన ఆరోపణలు పార్టీలో భూకంపం సృష్టించాయి. టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత ఇచ్చానని ఆయన అనడం టీడీపీ క్రమశిక్షణను ప్రశ్నించేలా ఉంది. దీనికి ప్రతిగా ఎంపీ చిన్ని, కొలికపూడిని "వైసీపీ కోవర్టు"గా అభివర్ణించడంతో ఈ వివాదం వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకుంది. నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పేకాట క్లబ్ నిర్వాహకులకు పదవులు ఇస్తున్నారన్నది కొలికపూడి ప్రధాన ఆరోపణకొలికపూడి వైఖరిని గమనిస్తున్న విశ్లేషకులు దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందని భావిస్తున్నారు. పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, దానిని 'దళిత నేతపై అణచివేత'గా చిత్రీకరించి సానుభూతి పొందాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ కావడం, స్థానిక వైసీపీ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయన త్వరలోనే పార్టీ మారతారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టి సొంతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక కేడర్‌ను నిర్మించుకోవాలని ఆయన చూస్తున్నారు.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ కొలికపూడికి నోటీసులు జారీ చేసింది. సాధారణంగా క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండే చంద్రబాబు, కొలికపూడి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఆయనను సస్పెండ్ చేస్తే అమరావతి ఉద్యమ నేపథ్యం ఉన్న వ్యక్తిని పంపించేశారనే అపవాదు వస్తుందని, అలాగని వదిలేస్తే మిగిలిన నేతలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ఆందోళన చెందుతోంది.మొత్తానికి, తిరువూరు ఎమ్మెల్యే వ్యవహారం టీడీపీలో ఒక 'ముల్లు'లా మారింది. అభివృద్ధి జరగడం లేదని ఆయన అంటున్న మాటలు వాస్తవమా లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేస్తున్న రచ్చా అన్నది పక్కన పెడితే, ఇది కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మాత్రం దెబ్బతీస్తోంది. కొలికపూడి స్వయంగా తప్పుకుంటారా లేక పార్టీయే వేటు వేస్తుందా అన్నది వేచి చూడాలి.

# విశాఖ ఉక్కు ఉద్యమానికి ఐదేళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి ఐదేళ్లు అయింది.విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమిందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ ఉ కో సమగ్ర నివేదిక సమర్పించింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్థుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఖీఎఔఒ) ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ (ూంఎఒ) నుండి విడివడి ఖీఎఔఒ గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిడ్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేకపోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్‌ఆర్‌సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఎసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

# వైసీపీ మౌనం - వ్యూహామా? వైఫల్యమా



**విజయవాడ, ఫిబ్రవరి 11, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుసరిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించకపోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు , అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున , పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్రస్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది.రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

### ఎమ్మెల్సీ ఎన్నికలు బాయ్ కాట్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన.రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి.మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# టీమిండియా మాపై 250 కొట్టే ప్రశ్నే లేదు: నమీబియా యువ ఫాస్ట్ బౌలర్ ధీమా

**టీమిండియాను 180 పరుగులకే పరిమితం చేస్తామన్న మాక్స్ హీంగో**

**భారత్‌లో 50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడేనని అంగీకారం**

**గత మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ వల్ల ఓడిపోయామని విచారం**

**కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ అనుభవం తమకు ఎంతో ఉపయోగపడుతోందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా రేపు గురువారం నాడు అరుణ్ జైట్లీ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో ఆఫ్రికా పసికూన నమీబియా తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్‌లో టీమిండియాను 180 పరుగులకే కట్టడి చేస్తామని నమీబియా 18 ఏళ్ల యువ ఫాస్ట్ బౌలర్ మాక్స్ హీంగో ధీమా వ్యక్తం చేశాడు. టీమిండియా బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉన్నప్పటికీ, తమ బౌలింగ్‌తో వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేయగలమని అన్నాడు."భారత్ మాపై 250 పరుగులకు పైగా స్కోర్ చేసే ప్రసక్తే లేదు. బహుశా వారు 180 పరుగులు చేయొచ్చు. కానీ, 300 పరుగులు మాత్రం అస్సలు చేయలేరు" అని మ్యాచ్‌కు ముందు ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హీంగో పేర్కొన్నాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో నమీబియా ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.భారత్‌లో, వారి సొంత ప్రేక్షకుల మధ్య ఆడటంపై హీంగో స్పందిస్తూ.. "50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడితో కూడుకున్నప్పటికీ, ఇది ఒక అద్భుతమైన అనుభూతి. నాలో కంగారు ఉన్నా, నా నైపుణ్యాలను ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నాను. నా సహచరులు నాకు ధైర్యం చెబుతున్నారు" అని తెలిపాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ కారణంగా ఓడిపోయామని, ఇది తమను నిరాశపరిచిందని అన్నాడు.

భారత్‌కు 2011 వన్డే ప్రపంచకప్ అందించిన గ్యారీ కిర్‌స్టెన్ తమ జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా ఉండటం ఎంతో మేలు చేస్తోందని, ఆయన అనుభవం జట్టుకు ఉపయోగపడుతోందని హీంగో వివరించాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన హీంగో, తన పాఠశాలలో క్రికెట్ ఆడటం మొదలుపెట్టి, ప్రతిభతో జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడాను స్ఫూర్తిగా తీసుకున్నానని, సీనియర్ బౌలర్లు రూబెన్ ట్రంపెల్‌మన్, జేజే స్మిత్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నానని అతను పేర్కొన్నాడు.

# టీ20 వరల్డ్ కప్: ఆసీస్ కు గట్టి ఎదురుదెబ్బ... కెప్టెన్ మార్ష్ కు తీవ్ర గాయం

**ప్రాక్టీస్‌లో మార్ష్ కు గజ్జల్లో బంతి తగలడంతో అంతర్గత రక్తస్రావం**

**స్టాండ్‌బై ప్లేయర్‌గా శ్రీలంకకు స్టీవ్ స్మిత్**

**ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు ట్రావిస్ హెడ్ కెప్టెన్సీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు టోర్నీ ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ వారం ప్రాక్టీస్ సెషన్‌లో గజ్జల్లో బంతి బలంగా తగలడంతో అతను అంతర్గత రక్తస్రావంతో బాధపడుతున్నాడు. దీంతో నేడు ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు మార్ష్ దూరమయ్యాడు. అతని స్థానంలో ట్రావిస్ హెడ్ తాత్కాలికంగా జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.ఈ గాయంపై క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటన విడుదల చేసింది. "మార్ష్‌కు తీవ్రమైన నొప్పి, అసౌకర్యం ఉన్నాయి. కదలడానికి కూడా ఇబ్బంది పడుతున్నాడు. స్కానింగ్‌లో అంతర్గత రక్తస్రావం జరిగినట్లు నిర్ధారణ అయింది. అతనికి కొంతకాలం విశ్రాంతి అవసరం. లక్షణాలు తగ్గిన తర్వాత, వైద్యుల సలహా మేరకు అతను తిరిగి ఎప్పుడు ఆడతాడో నిర్ణయిస్తాం" అని తెలిపింది.ముందుజాగ్రత్త చర్యగా, స్టాండ్‌బై ప్లేయర్‌గా ఉన్న స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను శ్రీలంకకు రావాల్సిందిగా జట్టు యాజమాన్యం కోరింది. అతను అక్కడి వాతావరణానికి అలవాటుపడి, అవసరమైతే జట్టులోకి రావడానికి సిద్ధంగా ఉంటాడు. ప్రస్తుతానికి స్మిత్‌ను అధికారికంగా ప్రపంచకప్ స్క్వాడ్‌లో చేర్చలేదు. అయితే, ఇప్పటికే హేజిల్‌వుడ్ స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో ఆసీస్ 15 మంది సభ్యుల జట్టులో ఒక ఖాళీ ఉంది.

ఇప్పటికే హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ వంటి కీలక బౌలర్లు గాయాలతో దూరం కాగా, ఇప్పుడు కెప్టెన్ మార్ష్ గాయపడటం ఆస్ట్రేలియాను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అయితే, మరో పేసర్ నాథన్ ఎల్లిస్ గాయం నుంచి కోలుకుని ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం కాస్త ఊరటనిచ్చే అంశం.

# టీ20 వరల్డ్ కప్: ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు.. థ్రిల్లింగ్ పోరులో ఆఫ్ఘన్‌పై సఫారీల గెలుపు

**ప్రధాన మ్యాచ్ టై.. సూపర్ ఓవర్‌కు దారితీసిన ఉత్కంఠ**

**తొలి సూపర్ ఓవర్ కూడా టై.. రెండో సూపర్ ఓవర్‌తో మరింత డ్రామా**

**రెండో సూపర్ ఓవర్‌లో 23 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా**

**గుర్బాజ్ హ్యాట్రిక్ సిక్సర్లతో పోరాడినా.. చివరి బంతికి ఓడిన ఆఫ్ఘన్**

**5 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విజయం అందుకున్న సఫారీలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన, ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచిపోయే పోరులో దక్షిణాఫ్రికా అద్భుత విజయం సాధించింది. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం ఏకంగా రెండు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. చివరికి, రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో గెలిచిన సఫారీ జట్టు ఊపిరి పీల్చుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకు ఇరు జట్ల ఆటగాళ్లు కనబరిచిన పోరాట పటిమ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది.రెండో సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్థాన్ విజయానికి 24 పరుగులు అవసరమవ్వగా, ఆ జట్టు బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్... సఫారీ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో వరుసగా మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో సమీకరణం చివరి బంతికి 6 పరుగులుగా మారింది. ఈ దశలో మహరాజ్ విసిరిన వైడ్ బాల్‌తో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. అయితే, చివరి బంతికి గుర్బాజ్ భారీ షాట్‌కు యత్నించి మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆఫ్ఘన్ పోరాటం ముగిసింది. అంతకుముందు, ఈ సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా డేవిడ్ మిల్లర్ (2 సిక్సర్లు) చెలరేగడంతో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది.వాస్తవానికి, ఈ మ్యాచ్‌లో తొలి సూపర్ ఓవర్ కూడా టైగా ముగియడంతోనే రెండో సూపర్ ఓవర్ అనివార్యమైంది. తొలి సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ 17 పరుగులు చేయగా, ఛేదనలో సఫారీలకు చివరి బంతికి 6 పరుగులు అవసరమయ్యాయి. ఫజల్‌హక్ ఫరూఖీ బౌలింగ్‌లో ట్రిస్టన్ స్టబ్స్ సిక్సర్ బాదడంతో స్కోర్లు సమం అయ్యాయి. దీంతో క్రికెట్ అభిమానులు మరో అరుదైన ఘట్టానికి సాక్షులుగా నిలిచారు.

అంతకుముందు, ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (59), ర్యాన్ రికెల్టన్ (61) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్థాన్ కూడా సరిగ్గా 187 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో రహ్మానుల్లా గుర్బాజ్ (84) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అతని పోరాటం ప్రధాన ఇన్నింగ్స్‌లోనూ, ఆ తర్వాత సూపర్ ఓవర్‌లోనూ జట్టును గెలిపించలేకపోయింది.

# ఆ హీరోకు ఎవరూ సాటి లేరు



**ఆకాన్షా రంజన్ కపూర్ ఎలక్ట్రిక్ బ్లూలో దేశీ దివా గ్లామ్‌ను ప్రసరిస్తుంది**

ఒకప్పుడు టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి లయడ దాదాపు పదేళ్ల క్రితం సినిమాలకు గుడ్‌బై చెప్పి అమెరికాలో స్థిరపడ్డ సంగతి తెలిసిందే. కుటుంబ జీవితం, వ్యక్తిగత ప్రాధాన్యాలకే ఎక్కువ సమయం కేటాయించిన లయ, మళ్లీ సినిమాల వైపు చూస్తారని అప్పట్లో ఎవ్వరూ ఊహించలేదు. కానీ కాలం మారింది. సోషల్ మీడియాలో ఆమె చేసిన డ్యాన్స్ రీల్స్ ఒక్కసారిగా వైరల్ కావడంతో, లయ పేరు మళ్లీ ఇండస్ట్రీలో చర్చకు వచ్చింది. అదే పాపులారిటీ ఇప్పుడు ఆమె రీ–ఎంట్రీకి బలమైన పునాది అయింది.

**విజయేంద్రవర్మలో బాలయ్యతో కలిసి నటించిన లయ**

ప్రస్తుతం లయ, శివాజీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సాంప్రదాయిని సుప్పిణి సుద్ధపూసణి అనే వెబ్ ఫిల్మ్‌తో గ్లామర్ ప్రపంచంలోకి మరోసారి అడుగుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో లయ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నందమూరి బాలకృష్ణ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 2004లో విడుదలైన విజయేంద్ర వర్మ సినిమాలో బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా నటించిన అనుభవాన్ని గుర్తు చేసుకున్న లయ, ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.

**ఆయన చాలా ప్రొఫెషనల్**

బాలకృష్ణ గారు ఎంతో ప్రొఫెషనల్ అని, సెట్స్‌లో ఆయనతో కలిసి పని చేయడం చాలా సులువుగా ఉంటుందని, ఆయన అందరినీ నవ్విస్తూ, పాజిటివ్ ఎనర్జీతో వాతావరణాన్ని హాయిగా ఉంచుతారని, డిసిప్లిన్, టాలెంట్ విషయంలో ఆయనకు ఎవరూ సాటి లేరంటూ లయ చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లో మళ్లీ ఆయనతో కలిసి నటించాలని తన కోరికను కూడా ఆమె ఈ సందర్భంగా బయటపెట్టారు.

**ఆ కాంబో మళ్లీ కుదిరేనా?**

ఇప్పటి ట్రెండ్‌ను గమనిస్తే, సీనియర్ హీరోలు తమ వయసుకు దగ్గరగా ఉన్న హీరోయిన్లతో జోడీ కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో బాలకృష్ణ లాంటి స్టార్, డబుల్ రోల్స్ చేసే కథల్లో లయ లాంటి సీనియర్ హీరోయిన్ తో అయితే స్క్రీన్‌పై మంచి బ్యాలెన్స్ కుదిరే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. లయబాలయ్య కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయితే ప్రేక్షకుల్లో నాస్టాల్జియా ఫీలింగ్‌తో పాటు కొత్త ఇంట్రెస్ట్ కూడా ఏర్పడే అవకాశముంది.అయితే లయ రీ–ఎంట్రీ విషయానికి వస్తే, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా ఆమెకు ఆశించిన స్థాయిలో గుర్తింపు తీసుకురాలేదు. అయినప్పటికీ ఆమె ఆశలు ఇప్పుడు శివాజీ వెబ్ ప్రాజెక్ట్‌పైనే ఉన్నాయి. ఈ సినిమా గనుక హిట్ అయితే, లయ కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పుడు ఆమెకు మళ్లీ పెద్ద సినిమాల నుంచి, ముఖ్యంగా సీనియర్ హీరోల సరసన నటించే ఆఫర్లు వచ్చే ఛాన్సుంది. మొత్తానికి, లయ సెకండ్ ఇన్నింగ్స్‌పై టాలీవుడ్ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.





**ఆకాంక్ష శర్మ ఎమరాల్డ్ గ్రీన్ కో-ఆర్డ్ సెట్‌లో బోల్డ్ మరియు గ్లామరస్‌గా ఉంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com